అడ్మిషన్ల భర్తీకి శ్రీకారం

- బీసీ సంక్షేమ బాలుర గృహంలో 100 సీట్లు
- నాణ్యమైన భోజనంతో పాటు వసతి
- తుక్కుగూడలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

తుక్కుగూడ: బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. వీటిలో భాగంగా తుక్కుగూడ పురపాలిక కేంద్రంలో బాలుర గృహం కలదు. ఇందులో విద్యార్థుల సంఖ్య పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనికోసం కొత్తగా చేరబోయే వారికి పలు రకాల వసతులను కలిపించనున్నారు. ఇక్కడ విద్యార్థుల సంఖ్య ప్రతీ ఏటా తగ్గుతూ వస్తోంది. దీంతో ఈ గృహంలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు.

మూడో తరగతి నుంచి..

బాలుర వసతి గృహంలో మూడోతరగతి నుంచి పదోతరగతి వరకు 100 మందికి ప్రవేశం కల్పించే అవకాశం ఉంది. రెండు, మూడేళ్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థులు చేరకపోవడంతో కొన్ని సీట్లు మిగిలిపోయేవి. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రస్తుతం 50శాతం పైగా విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ప్రవేశాలే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇక్కడ ఇతర మండలాలకు చెందిన వారికి సైతం ప్రవేశం కల్పించనున్నారు. స్థానికంగా ఉండే పాఠశాలలకు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు.



తుక్కుగూడలోని బాలుర వసతిగృహం

వసతిగృహంలో చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇక్కడ వసతి గృహంలో 100 మంది విద్యార్థుల్లో బీసీలకు 75 సీట్లు, ఎస్సీలకు 15సీట్లు, ఎస్టీలకు 5 సీట్లను కేటాయించారు.

పౌష్టికాహారం అందజేత..

విద్యార్థులకు వసతితో పాటు, నాణ్యమైన భోజనాన్ని నిత్యం అందించనున్నారు. గతంలో విద్యార్థులకు మెస్ చార్జీల రూపేణ ఒక్కరిపై రూ.1,100లు ఖర్చు చేస్తుండేది. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా రూ.2,150 వెచ్చించనుంది. దీంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన పౌష్టికాహారం వడ్డించనున్నారు.

ప్రతీరోజు..

ఉదయం 7గంటలకు రాగిజావ, పాలు. అనంతరం గంట తరువాత బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఉప్మా, పులిహోర, కిచిడి రసం, చపాతి, పూరీ, ఇడ్లీ, జీర రైస్, టమాట అన్నం ఇలా రోజుకోరకంగా అందజేయనున్నారు. మధ్యాహ్నం పాఠశాలలో భోజనం ఉంటుంది. సాయంత్రం ఐదు గంటలకు స్నాక్స్ పల్లి పట్టి, అటుకులు, బిస్కెట్స్, శనగలు, బొబ్బర్లు తదితర పదార్థాలు అందించనున్నారు. గతంలో వారానికి రెండు గుడ్లు, అరటిపండ్లు ఇచ్చేవారు. ఇప్పుడు వారంలో ఐదు రోజుల పాటు ఇవ్వనున్నారు. వారంలో ఆదివారం చికెన్ ఉంటుందని అధికారులు తెలిపారు. దీనికి తోడు విద్యార్థులకు మూడోతరగతి నుంచి ఏడోతరగతి వరకు రూ.150, 8నుంచి 10వ తరగతి వరకు రూ.200 కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి

తుక్కుగూడ బీసీ బాలుర సంక్షేమ వసతిగృహంలో 100 సీట్లు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి విస్తృత్తంగా ప్రచారం చేస్తున్నాం. మొత్తం సీట్లను భర్తీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన విద్యార్థులు వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జగదీశ్ కుమార్, బీసీ, బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి, తుక్కుగూడ

బృందావన్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

- మొరపెట్టుకున్న ప్రజలు

బడంగ్‌పేట్: బృందావన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘువేందర్‌రెడ్డితో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా 26వ డివిజన్ బృందావన్ కాలనీలోని పార్కు స్థలాన్ని ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులు పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తెచ్చారు. పార్కును అభివృద్ధి చేస్తే చిన్నారులతో పాటు పెద్దలు, మహిళలకు ఆహ్లాదంగా ఉంటుందని, ఉదయం, సాయంకాలం సమయాల్లో సేద తీరొచ్చని ఆయనతో విన్నవించారు. పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అసౌకర్యంగా మారిందన్నారు. ఈ విషయాన్ని తక్షణమే మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పృథ్వీ రాథోడ్, రమేశ్, చంద్రశేఖర్, సందీప్, ఆంజనేయులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



బృందావన్ కాలనీలో పార్కును పరిశీలిస్తున్న రాఘువేందర్‌రెడ్డి

ఏనుగు జంగారెడ్డికి సన్మానం



జంగారెడ్డిని సన్మానిస్తున్న మీర్‌ఖాన్‌పేట కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియమితులైన ఏనుగు జంగారెడ్డిని మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ దేరంగుల నరసింహా ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తామంతా మీ వెంటే నడుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మదన్‌పాల్‌రెడ్డి, కాకి నరసింహా, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జి.నరసింహా, శ్రీశైలం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మండల నాయకుడు అందుగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజనీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ వాంబేకాలనీ, గంగా హాస్పిటల్, ఆనంద్‌నగర్, పుష్పాగార్డెన్స్, శివం హిల్స్, అల్కాపురి, లక్ష్మీనగర్, తారామతిపేట, గౌరెల్లి, శివగంగా కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ ఎల్‌బీనగర్, సిరీస్, లింగోజిగూడ, హనుమాన్‌నగర్, డెంటల్ కళాశాల, యాదవనగర్, ప్రియానివాస్, పసుమాముల ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

జగదీశ్ రావుకు శుభాకాంక్షలు

పహాడీషరీఫ్: టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బడుగు బలహీన వర్గాలకు చెందిన సంగిశెట్టి జగదీశ్ రావును రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ చేనేత విభాగం అధ్యక్షుడు మన్న రవికుమార్ ఆధ్వర్యంలోని నాయకుల బృందం ఆదివారం ఘనంగా సన్మానించారు. చేనేత విభాగం హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షురాలు మచ్చ వరలక్ష్మీతో పాటు ఏలె నరేందర్, కోనంపేట నర్సింహా, బొల్ల వెంకటేశ్, భరత్‌కుమార్, పి.సురేశ్, పి.ప్రత్యూష్ తదితరులు ఆయనకు శాలువా కప్పి, పూలబొకే అందజేశారు.

డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు



భట్టి విక్కమార్కను సన్మానిస్తున్న జానకీరామ్

తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క జన్మదిన వేడుకలను నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన పలువురు నాయకులు, టీపీసీసీ రాష్ట్ర నాయకులు గోగికర్ జానకీరామ్, కోటగళ్ల రాజ్‌కుమార్ తరలివెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు భట్టి విక్రమార్క నివాసానికి వెళ్లి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిండు శ్రీనివాస్‌గౌడ్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రం.. ప్రజా మూత్రశాల

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని కొత్తపేట గ్రామంలో నిర్మించిన ప్రజా మూత్రశాల నిర్వహణ లోపంతో దుర్గంధ భరితంగా మారింది. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని బస్తీ దవాఖానా పక్కనే ఈ టాయిలెట్ ఉంది. అక్కడి నుంచి వస్తున్న దుర్వాసనతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెల పింఛన్ తీసుకునేందుకు వచ్చే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఈ మూత్రశాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నామని వారు చెబుతున్నారు. దీని గురించి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్లను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



ప్రజా మూత్రశాల

హామీలు అమలు చేయాలి

బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహ యాదవ్

కేశంపేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పసుపుల నర్సింహాయాదవ్ పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇందిరమ్మ ఇళ్లను అనర్హులకు మంజూరు చేస్తున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ధరణీ స్థానంలో భూ భారతి తెచ్చిన రైతుల సమస్యలు నేటికి పరిష్కారం కావడం లేదని ఆయన ఆరోపించారు. అసైన్డ్ భూముల రైతులు మరణిస్తే నేటికి విరాసత్ చేయడం లేదని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంతో రాష్ట్ర ప్రభుత్వం యువతను తప్పుదోవ పట్టిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట కార్పొరేషన్ విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు ఆర్ కృష్ణ పేర్కొన్నారు. బృంగి హాస్పిటల్ సహకారంతో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ సెంటర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత న్యూరో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదన్నారు. కాలనీవాసుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా ప్రతీ ఆదివారం వైద్య శిబిరాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞానపురి కాలనీ అధ్యక్షుడు కృష్ణ

పేదల సంక్షేమమే ప్రధాని లక్ష్యం

మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన సాగుతుందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాదర్‌గుల్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో వికసిత భారత్ సంకల్ప సభను పార్టీ కార్పొరేషన్–2 అధ్యక్షుడు వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందెల శ్రీరాములు హాజరై ప్రసంగించారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని కొనియాడారు. నమ్మకం, ఆశీర్వాదం, విశ్వాసంతోనే మోదీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చారని కొనియాడారు. భారతదేశాన్ని తిరుగులేని శక్తిగా ప్రపంచ పటంలో నిలపారన్నారు. అనంతరం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 5 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న 10 మంది మాజీ కార్పొరేటర్లను సన్మానించారు.



మాజీ కార్పొరేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న అందెల, మాజీ కార్పొరేటర్లు

కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతన్న సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. ఆదివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని భూ సమస్యలు పరిష్కరించడం కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 118ను తీసుకొచ్చిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ స్వలాభం కోసం మధుయాష్కిగౌడ్ జీవో అమలు కాకుండా నిలిపివేశారని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లతో చర్చించి 118జీఓను తీసుకొచ్చామని తెలిపారు. కేవలం గజానికి రూ.250 మాత్రమే తీసుకుని కన్వీనియన్స్ డీడ్‌లు అందజేశామని ఎన్నికల కోడ్ రావడంతో దరఖాస్తు చేసుకున్న వారిలో 25 శాతం మందికి మాత్రమే కన్వీనియన్స్ డీడ్‌లు అందజేశామన్నారు. కన్వీనియన్స్ డీడ్‌లు పొందిన వారికి 2008 కన్నా ముందు అనుమతులు ఉన్న వారికి రిజిస్ట్రేషన్లు అవుతున్నాయ లేదో పరిశీలించుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్నప్పుడు జీవో బోగస్ ఎలా అవుతుందని దీనిపై మధుయాష్కిగౌడ్ చర్చకు రావాలన్నారు. ఈ సమావేశంలో సుధాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధన్‌రాజ్, పోగుల రాంబాబు, ముత్యంరావు, రవీంధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సోమిరెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, మాధవరం నరసింహరావు, సుమన్‌గౌడ్, సుధాకర్‌యాదవ్, సతీష్‌గౌడ్, శ్రీనివాస్ శశిధర్‌రెడ్డి, రాఘవేంధర్ రావు, భిక్షపతి పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం

ఎల్‌బీనగర్: ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి, డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి పవన గిరికాలనీఫేజ్–2లో రూ.36 లక్షలు, ఫేజ్–1లో రూ.13 లక్షలు, ఆదిత్యానగర్‌కాలనీలో రూ.23 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రాజరాజేశ్వరీకాలనీలో రూ.3 లక్షలతో యూజీడీ పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. శివారు ప్రాంతాల్లో కాలనీలు నూతనంగా ఏర్పాటు అవుతున్నాయని, ఎన్నికల హామీల మేరకు ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణగౌడ్, మురళీధర్‌రెడ్డి, సాయిలుగౌడ్, నర్సింహ్మ, వేణుగోపాల్, జాన్, కుమారాస్వామి, రమణారెడ్డి, వెంకటేష్, రాంగోపాల్, సందీప్ పాల్గొన్నారు.



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని శ్రీసాయి చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు ఎండీ ఇనాయత్, కాంగ్రెస్ నాయకులు రాజు పేర్కొన్నారు. ఆదివారం బోడంపహాడ్ గ్రామంలో మూడు వారాలుగా సమ్మర్ ఛాంపియన్స్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ..క్రీడలతో మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బందేశ్వర్, హరి, మల్లేశ్, రఫీక్, భాస్కర్‌రెడ్డి, విష్ణు, శివ, పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.40, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.33, మునగ రూ.40, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.31, కీర రూ.35, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.55. ఈ ధరలు సోమవారం ఉదయం 9గంటల వరకు వర్తిస్తాయి.

గో సేవతో పుణ్యం

మాజీ కౌన్సిలర్ లతాశ్రీ

షాద్‌నగర్ రూరల్: గో మాతకు సేవచేస్తే ఎంతో పుణ్యమని మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలాగనర్ మండలం మోతీఘణపూర్ గ్రామానికి చెందిన బండవెంకటేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మమ్మ ఆదివారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గో మాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. గో సంతతి అంతరించిపోకుండా గోవులను రక్షించుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. నోరులేని మూగజీవాల రక్షణకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం గడ్డి వితరణ చేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సింగపాగలక్ష్మయ్య పాల్గొన్నారు.

సీఎస్కే విల్లాస్ నూతన కమిటీ

అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని సీఎస్కే విల్లాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం సీఎస్కే విల్లాస్ పార్కులో నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అరటియాదయ్య, అధ్యక్షుడు బంటారంమహేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ఇంజమూరిగోపాల్ రమేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ, భాగ్యలక్ష్మి, ప్రధాన క్యాదర్శిగా ప్రసన్న, సహాయ కార్యదర్శులుగా భిక్షపతి, దత్తాత్రేయ, నాగిళ్లకిషోర్, ప్రశాంత్, రాఘవేందర్‌రెడ్డి, సునీత, న్యాయ సలహాదారులుగా ఇంజమూరి నర్సింలు, హరికిషన్, హరీశ్, మీడియా ఇంచార్జిలుగా రాఘవేంద్రగౌడ్, సందీప్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీ వాసులు నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

మొయినాబాద్: ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు క్యామ పద్మనాభం డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆదేశాల మేరకు ఆదివారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సౌడపు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని గ్రామ శాఖ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి ప్రకటించారు. గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడిగా బురాన్, ఉపాధ్యక్షుడిగా కోరుకొండ రాజశేఖర్‌యాదవ్, ప్రధానకార్యదర్శులుగా ఎండీ ఇక్బాల్, ఏనుగు బాలకృష్ణ, సోషల్ మీడియా అధ్యక్షుడిగా బొక్క రాజ్‌మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎ.జగదీష్, శేఖర్‌గౌడ్, బొక్క దేవేందర్‌రెడ్డి, గాదె కుమార్, ఫయాజ్, శ్రీనివాస్‌గౌడ్, కుమ్మరి కృష్ణ, దామోదర్‌రెడ్డి, తల్లా మల్లేశ్, తల్లోజు మహేష్‌చారి పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామక పత్రం అందిస్తున్న నాయకులు

హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

హస్తినాపురం: హస్తినాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో వరదనీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీహెచ్‌ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి పరిష్కరించనున్నట్లు సుజాతనాయక్ వెల్లడించారు. ప్రజల సహకారంతో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

వనస్థలిపురం: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సంస్థల ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం ఆదివారం వనస్థలిపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన సంస్థల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్, నక్క శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్, కైఫ్, సురేందర్, వలీ, సందీప్, సైదులు, స్వదేశీ భూషణ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

6కే రన్‌కు స్పందన

ఎల్‌బీనగర్: మహావీర్ హరణి వనస్థలి జాతీయ పార్కు (డీర్ పార్కు) మన్సూరాబాద్ గేట్ వద్ద మహావీర్ హరణి వనస్థలి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్‌ను బలపరుస్తూ ఆదివారం నిర్వహించిన 6కే రన్‌కుఎవిశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ నేత చింతల సురేందర్‌యాదవ్, నల్లగొండ గద్దర్ హాజరై రన్‌లో పాల్గొన్న సభ్యులకు మెడల్స్ అందజేశారు.అనంతరం అపోలో హాస్పిటల్ సహకారంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్రంరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ, జగదీష్‌యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, రాంరెడ్డి, బీట్ ఆఫీసర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మహేశ్వరం: మండల కేంద్రంలోని మహేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గడికోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసుకొని తరగతి గదిలో, ఆవరణలో జరిగిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు, కుటుంబ సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ..తాము చదువుకున్న మహేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. తోటి స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకుంటామన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.